## క్లుప్తంగా

### వైభవంగా రథోత్సవం



స్వామివారి రథాన్ని లాగుతున్న భక్తులు

**తాళ్లపూడి:** గ్రామంలో అతి పురాతన రుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాలుడి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. డోలు సన్నాయి, కోలాటం, మేళతాళాలతో రథోత్సవం వీధుల్లో ఘనంగా సాగింది. అర్చకులు పెద్దింటి శ్యామ్, రాజగోపాల్, జనార్దన్ తదితరుల ఈ పూజల కార్యక్రమాల్లో నిర్వహించారు. అంతకు ముందు సర్పంచ్ నక్కా అనురాధ, నక్కా చిట్టిబాబు దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ముందుగా రథాన్ని అగ్నికుల క్షత్రియులు లాగారు. ఉత్సవాల్లో టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు పరస రాధాకృష్ణ, సింహాద్రి జనార్దనరావు, గోకవరపు సూరిబాబు, బొర్రా శ్రీరామ చంద్రమూర్తి, సాలస ఉమ, మాణిక్యం, కంకిపాటి సాయి, వినయ్, నిలి శ్రీనివాస్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

### ఘనంగా గ్రామోత్సవం



తాడిపర్రులో గోపాలస్వామి ఊరేగింపు

**ఉండ్రాజవరం:** కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఉండ్రాజవరంలో శ్రీదేవి, భూదేవి సహిత కేశవస్వామి, తాడిపర్రులో రుక్మిణీ సత్యభామా సమేత మదనగోపాల స్వామివార్లకు గురువారం ఉదయం అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం గరుడ వాహనోత్సవం అనంతరం స్వామివార్లను ఆయా గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం పారాయణం, భజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్లు చిట్టూరి రామకృష్ణ, కోడూరి హనుమంతరావు, ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### బ్యాలెట్ యూనిట్లపై సెక్టోరల్ అధికారులకు శిక్షణ



సెక్టోరల్ అధికారులకు శిక్షణ ఇస్తున్న ట్రైనీ సుబ్రహ్మణ్యం

**గోపాలపురం:** బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాడ్‌ల వినియోగంపై సెక్టోరల్ అధికారులు అవగాహన కలిగి ఉండాలని కమిషనింగ్ ప్రోగ్రెస్ ట్రైనీ ఎంఎస్ సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో గురువారం నియోజకవర్గ స్థాయి సెక్టోరల్ అధికారులకు బ్యాలెట్ యూనిట్ల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ట్రైనీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కంట్రోల్ యూనిట్, బ్యాలట్ యూనిట్, వీవీప్యాట్‌లు ఎలా సిద్ధం చేయాలన్న అంశాలపై అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ డి.వనజాక్షి, ట్రైనీ కలెక్టర్ కె.సువర్ణ గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాల సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

### చాగల్లులో పోలీసు కవాతు



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న పోలీసులు

**చాగల్లు:** మండలంలో గురువారం పోలీసులు కవాతు నిర్వహించారు. చాగల్లు ఎస్సై పి.నాగరాజు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కొవ్వూరు డీఎస్పీ, రూరల్ సీఐ ఆధ్వర్యంలో మండలంలోని మీనానగరం, ఊనగట్ల, ఎస్.ముప్పవరం, గరప్పాడు, నందిగంపాడు, చిక్కాలపాలెంలో కవాతు నిర్వహించామన్నారు. రాబోయే జనరల్ ఎలక్షన్స్ దృష్ట్యా ప్రజలు ఎటువంటి భయం లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవడానికి, శాంతి భద్రదల పరిరక్షణ కోసం మేమున్నామని భరోసా కల్పించడానికి నిర్వహించారు. ఎన్నికల భద్రత నిమిత్తం కేటాయించిన కేంద్ర బలగాలతో పాటు స్థానిక పోలీసు సిబ్బంది కవాతులో పాల్గొన్నారు.

### టీడీపీ నాయకుల సమావేశాలు

**తాళ్లపూడి:** మండలంలో పలు గ్రామాల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిటి వెంకటేశ్వరరావు సమావేశాలు నిర్వహించారు. మలకపల్లి, పెద్దేవం, టిరుగుడుమెట్ట, వేగేశ్వరపురం, రావూరుపాడు గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జొన్నల గడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమని రామకృష్ణ, నామన పరమేశ్వరరావు, కై గాల శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

# పల్లెల్లో అభివృద్ధి పరుగులు

- యర్నగూడెంలో రూ.16.21 కోట్లతో పనులు
- గ్రామ సచివాలయ వ్యవస్థతో తీరిన ప్రజల కష్టాలు
- రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ప్రాధాన్యత



దేవరపల్లి మండలం యర్నగూడెంలో గ్రామ సచివాలయం



దళితవాడలో నిర్మించిన సిమెంట్ రోడ్డు

**దేవరపల్లి:** గ్రామాల్లో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. గత ప్రభుత్వాల్లో ఎన్నడూ జరగని అభివృద్ధి గత మూడేళ్ల పాలనలో జరుగుతుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థతో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయి. ప్రతి గ్రామంలో గత ఐదేళ్లుగా రూ.2 నుంచి 16 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు పూర్తి చేశారు. ఐదేళ్ల గ్రామాల పరిస్థితి. ఇప్పటి గ్రామాల పరిస్థితిని చూసి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ భవనాలను నిర్మాణం చేసి ప్రతి గ్రామ సచివాలయంలో 11 మంది ఉగ్యోగులను నియమించి పరిపాలనను పల్లె ప్రజల చేరువలోకి తీసుకువచ్చి సత్వర సేవలు అందిస్తున్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయడంతో గ్రామాలు మినీ సెక్రటరేట్లుగా ఉన్నాయి. గతంలో కుల, ఆదాయ, ఇతర ధ్రువీకరణ పత్రాలు కావాలంటే దూర ప్రాంతంలోని మండల కేంద్రాల్లో గల తహసీల్దార్ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలకు వెళ్లవలసి వచ్చేది. అదీ కూడా నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగవలసి వచ్చేది. దీనితో ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారు. గ్రామ సచివాలయ వ్యవస్థ రావడంతో గంట వ్యవధిలోనే సొంత ఊరులోనే ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాలను అందుకుంటున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి వైద్యాన్ని ప్రజల ముంగిటకు తీసుకువచ్చి వైద్యులను అందుబాటులో ఉంచారు. రైతు భరోసా ద్వారా వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహిస్తోంది.

**రూ.16.21 కోట్ల వ్యయంతో అభివృద్ధి**

పంచాయతీ, జిల్లా పరిషత్, మండల పరిషత్, గడపగడపకూ నిధులు, ప్రభుత్వం ఇచ్చిన ప్రత్యేక నిధులు, జలజీవన్ మిషన్, నాడు–నేడు కార్యక్రమాల ద్వారా యర్నగూడెంలో గత మూడేళ్లుగా సుమారు రూ.16.21 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు పూర్తి చేశారు. జిల్లా పరిషత్ నిధులు రూ.4.50 కోట్ల వ్యయంతో గ్రామంలో రోడ్లు నిర్మాణం, డ్రైనేజీల నిర్మాణం చేశారు. దీనిలో రూ.2 కోట్లతో పామాయిల్ ఫ్యాక్టరీ వరకూ సిమెంట్ రోడ్డు నిర్మాణం, రూ.70 లక్షలతో డ్రైనేజీల నిర్మాణం చేశారు. రూ. 20 లక్షలతో ఎస్సీ, వడ్డెర శ్మశాన వాటికల అభివృద్ధి, రూ.20 లక్షలతో బీసీ కమ్యూనిటీ భవనాల నిర్మాణం, గడపగడప నిధులు రూ.40 లక్షలతో ఎస్సీ, బీసీ ఏరియాలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, రూ.1.50 కోట్లతో ఇంటర్నల్ సిమెంట్ రోడ్ల నిర్మాణం, జలజీవన్ మిషన్ నిధులు రూ.35 లక్షలతో ఎస్సీ ఏరియాలో పైపులైన్ల నిర్మాణం, రూ.40 లక్షల వ్యయంతో గ్రావెల్ రోడ్ల నిర్మాణం, రూ.1.80 లక్షల వ్యయంతో రెండు గ్రామ సచివాలయ భవనాలు, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్ భవనాలను నిర్మాణం చేశారు. రూ.10 లక్షల వ్యయంతో సిద్ధిమళ్ల చెరువు, రూ.5 లక్షలతో గండి చెరువు అభివృద్ధి పనులు పూర్తి చేశారు. నాడు–నేడు కార్యక్రమంలో రూ. 50 లక్షలతో జెడ్పీ హైస్కూలు, రూ.10 లక్షలతో మండల పరిషత్ ప్రత్యేక పాఠశాలను అభివృద్ధి చేశారు. రూ.60 లక్షలతో బస్టాండ్ సెంటర్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేశారు.



యర్నగూడెంలోని నిడదవోలు రోడ్డులో నిర్మించిన సిమెంట్ డ్రైన్

> **గ్రామ అభివృద్ధే లక్ష్యం**
>
> 
>
> గత ప్రభుత్వాల్లో గ్రామం అభివృద్ధికి నోచుకోలేదు. పూర్తిగా పాలకుల నిర్లక్ష్యానికి గురైంది. డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు అధ్వాన్నంగా ఉండేవి. ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బంది పడేవారు. గ్రామ సచివాలయ వ్యవస్థ రావడంతో ప్రజల చెంతకు పరిపాలన అందుబాటులోకి వచ్చింది. తన పదవికాలంలో ఇప్పటి వరకు రూ.16.21 కోట్లతో గ్రామాన్ని అభివృద్ధి చేశాను. ఒక ప్రణాళిక ప్రకారం గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నా. ముందుముందు గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసి జిల్లాకు ఆదర్శంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నా. ప్రజాప్రతినిధులు, పాలకవర్గం, అధికారులు, గ్రామస్తుల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నా.
>
> – బొంతా భరత్‌బాబు, సర్పంచ్, యర్నగూడెం, దేవరపల్లి మండలం

### పక్కాగా ఎన్నికల కోడ్ అమలు

**నిడదవోలు రూరల్:** నిడదవోలు మండలంలో ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని, గ్రామాల్లో ఓటర్లను ప్రభావితం చేసే ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగ్‌లు కనిపించకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ జేఏ ఝాన్సీ సూచించారు. సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎన్నికల కోడ్ అమలుపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో రాజకీయ నాయకుల విగ్రహాలు, హోర్డింగ్‌లకు ముసుగులు వేశామన్నారు. శిలాఫలకాలు, వాటిపై ఉన్న ఫొటోలు కనిపించకుండా చూడాలని ఆదేశించామన్నారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు, బహుమతులు, తాయిలాలు తదితర వాటిపై ప్రత్యేకంగా ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమించినట్లు తెలిపారు. ఈఓపీఆర్డీ రత్నమాలిక, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### సిమెంట్ బెంచీల ఏర్పాటు



పట్టణంలో ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలు

**నిడదవోలు:** స్థానిక రోటరీక్లబ్ ఆధ్వర్యంలో రోటరీ సభ్యుల సహకారంతో గురువారం నిడదవోలు పట్టణం, మండలంలో తిమ్మరాజుపాలెం గ్రామంలో 20 సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, గోపిరెడ్డి శ్రీనివాస్, గొన్నాబత్తుల రామారావు, అద్దాల భాస్కర్, గుంటిపల్లి శివకుమార్, కాళ్ల రాంబాబు, పోలదాసు శ్రీనివాసరావు, బలగం అప్పారావు, బొజ్జా పాపారావు, కేజీ సతీష్, గొన్నబత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# జగన్‌తోనే పేదల సంక్షేమం

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- కాపవరంలో ఇంటింటా ప్రచారం



కాపవరంలో పథకాల కరపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు

**కొవ్వూరు:** సంక్షేమ పథకాలందాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని ఆయన కోరారు. కాపవరం, గోవర్ధనగిరి మెట్ట గ్రామాల్లో గురువారం ప్రజా ఆశీర్వాదం పేరుతో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరోసారి అవకాశం కల్పించాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నీ సంక్షేమ పథకాలు మళ్లీ ప్రతి పేదవాడి అందాలన్న, సువర్ణపాలన కొనసాగాలన్నా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, జెడ్పీటీసీ సభ్యురాలు బొంతా వెంకటలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, ముళ్లపూడి కాశీ విశ్వనాథ్, వెంపాటి సురేష్, ముదునూరి సూర్యనారాయణరాజు, కొయ్యే దుర్గారావు, మాసా ఆనంద్, ఉప సర్పంచ్ గోతం మేరీ ఝాన్సీ, బోడసింగి తులసీ, చిట్టూరి అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీదే విజయం

**మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ**

**నిడదవోలు:** వైఎస్సార్ సీపీదే నియోజకవర్గంలో విజయం ఖాయమని, ఓటింగ్ శాతం పెంచి మెజారిటీ పెంచేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలో 25 వార్డులో కౌన్సిలర్లతో కలిసి గురువారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఇప్పటి వరకూ అందించిన సంక్షేమ పథకాలు, పట్టణంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు పొందిన ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారన్నారు. సంక్షేమ పథకాలు పొందిన ప్రతి కుటుంబం పార్టీ విజయానికి తమ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తులకు వేసి మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రతిపక్షాల కుట్రలు తిప్పికొట్టాలని కోరారు. ఎంతమంది కలిసి వచ్చిన సీఎం వైఎస్ జగన్ ఒంటరిగానే విజయం సాధించడం ఖాయమన్నారు. ప్రతి ఒక్కరు సమన్వయంతో పనిచేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు మంచి మెజార్టీ తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ముంగటి కృపానందం, జిల్లా నాయకుడు మద్దిపాటి ఫణీంద్ర, జేసీఎస్ కన్వీనర్ ఎస్కే ఖాన్‌భాషా, కౌన్సిలర్లు ఆరుగొల్లు వెంకటేశ్వరరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, ఆకుల ముకుందరావు, గంగుల గోపియాదవ్, కోటి తదితరులు పాల్గొన్నారు.



25 వార్డులో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ, పార్టీ శ్రేణులు

# 7 నుంచి రబీ ధాన్యం కొనుగోలు

**మిల్లర్లతో అధికారుల సమావేశం**



సమావేశంలో మాట్లాడుతున్న సీఎస్ డీటీ సత్యనారాయణ

**నల్లజర్ల:** ఏప్రిల్ 7వ తేదీ నుంచి రబీ ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు చేస్తున్నట్టు సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అధికారులు మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణపై చర్చించారు. వ్యవసాయాధికారి కమల్‌రాజ్ మాట్లాడుతూ మండలంలో 2,900 హెక్టార్లలో రబీ వరి సాగైనట్టు చెప్పారు. 9వేల నుంచి 13 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అంచనా వేసినట్టు చెప్పారు. ముందుగానే గోనె సంచులు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. రైతులు పంటకోసే ముందు సంబంధిత రైతు భరోసా కేంద్రానికి సమాచారం అందించాలన్నారు. తద్వారా గోనె సంచులు, హమాలీ, రవాణా సౌకర్యం కల్పిస్తారన్నారు. తహసీల్దారు కృష్ణారావు మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన ధాన్యం దళారులకు విక్రయించి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నల్లజర్ల, అనంతపల్లి రైస్ మిల్లర్స్, నల్లజర్ల, పోతవరం డీసీఎంఎస్ ప్రతినిధులు హాజరయ్యారు.

# నేటి నుంచి నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు

**సుందరంగా ముస్తాబైన పుణ్యక్షేత్రం**



గౌరీపట్నం నిర్మలగిరి పుణ్యక్షేత్రంలోని చర్చి



గౌరీపట్నం వద్ద నిర్మలగిరిలోని క్రీస్తు దేవాలయం

**దేవరపల్లి:** రాష్ట్రంలో ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందిన నిర్మలగిరి పుణ్యక్షేత్రంతో మేరీమాత ఉత్సవాలు శుక్రవారం నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. నిర్మలగిరిని అందంగా ముస్తాబు చేశారు. ఏలూరు పీఠాధిపతి జయరావు పొలిమెర పర్యవేక్షణలో ఉత్సవాల నిర్వహణకు కమిటీ, ఫాదర్లు ఏర్పాట్లు చేశారు. దేవరపల్లి మండలం గౌరీపట్నం గ్రామానికి ఆనుకుని ఈ క్షేత్రం ఉంది. క్షేత్రం ఆవిర్భావానికి 1978లో అప్పటి ఏలూరు పీఠాధిపతి జాన్ ములగాడ నాంది పలకగా పలువురు ఫాదర్లు పుణ్యక్షేత్రం అభివృద్ధికి పాటుపడ్డారు. పుణ్యక్షేత్రాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. కులమతాలకు అతీతంగా భక్తులు మేరీమాతను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలిరానున్నారు.

1778లో బిషప్ జాన్‌ములగాడ గౌరీపట్నంలో నిర్మలగిరి క్షేత్రాన్ని నిర్మించాలని సంకల్పించారు. 1976లో ఏలూరు బలిపీఠం ఏర్పడింది. జాన్ ములగాడ తొలి పీఠాధిపతిగా నియమితులయ్యారు. అనంతరం బిషప్ ములగాడ కారులో విశాఖపట్నం వెళుతుండగా గౌరీపట్నం వద్ద కారు మరమ్మతులకు గురైంది. కారు దిగి జాన్‌ములగాడ చుట్టూ పరిశీలించారు. ఎత్తైన కొండలు, కారుచీకటి, ముళ్లపొదలతో నిండి ఉన్న చిట్టడవి. భయంకర వాతావరణం. అంతలోనే ములగాడ మనస్సులో ప్రేరణ. ఈ ప్రాంతంలో ఆలయం నిర్మించాలని ప్రేరణ కలిగింది. కారు మరమ్మతులు చేయించుకుని విశాఖపట్నం బయలుదేరారు. 1978లో గౌరీపట్నం ప్రాంతంలో మేరీమాత ఆలయం నిర్మాణానికి సంకల్పం చేశారు. 1979లో ఆలయ నిర్మాణం చేసి ఫాదర్ మైఖేల్‌ను తొలి డైరెక్టర్‌గా నియమించారు. 1992లో ఫాదర్ దిరిసిన ఆరో పుణ్యక్షేత్రం డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. 1995లో పుణ్యక్షేత్రంలో ఆధ్యాత్మిక ప్రశాంత వాతావరణం కల్పించడానికి ప్రేమసేవా ఆశ్రమం ఏర్పాటు చేశారు. ఆశ్రమం డైరెక్టర్‌గా ఫాదర్ జేసురాజన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఏటా మార్చిలో ఉత్సవాలు మతాలకు అతీతంగా భక్తులు ఉత్సవాల్లో పాల్గొని కొబ్బరికాయలు కొట్టడం, కొవ్వొత్తులను వెలిగించడం, తలనీలాలు సమర్పించి దైవదూత అనుగ్రహం కోసం ప్రార్థిస్తారు. ఉత్సవాల్లో భాగంగా దివ్య బలిపూజలు, దివ్య సత్ప్రసాద ఆరాధనలు నిర్వహిస్తారు.

# నిడదవోలుకు ఇద్దరు ఎమ్మెల్యేలు

- ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన ఉమ్మడి జనసేన అభ్యర్థి దుర్గేష్
- చర్చనీయాంశంగా మారిన దుర్గేష్ మాటలు
- అయోమయంలో జనసేన, టీడీపీ క్యాడర్

**నిడదవోలు:** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధిస్తే నిడదవోలు నియోజకవర్గానికి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉంటారని నిడదవోలు ఉమ్మడి జనసేన అభ్యర్థి కందుల దుర్గేష్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యాలు నియోజకవర్గంలో చర్చినీయాంశంగా మారాయి. ఉండ్రాజవరం మండలం చిలకపాడు గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో గురువారం జనసేన అభ్యర్థి దుర్గేష్ పరిచయ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జనసేన అభ్యర్థి కందుల దుర్గేష్ మాట్లాడుతూ నన్ను గెలిపించండి, నేను మీకు ఎమ్మెల్యేగా ఉంటాను. అదేవిధంగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు కూడా మీకు రెండో ఎమ్మెల్యేగా ఉంటారని చేసిన వ్యాఖ్యలు నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే స్థానికేతరులకు టికెట్ ఇవ్వడంపై టీడీపీ అధినేత చంద్రబాబు తీరును ఎండగడుతూ గతంలో ఆందోళనలు చేసిన టీడీపీ క్యాడర్ కడుపులో కత్తులు పెట్టుకుని అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. టీడీపీలో మరోక వర్గ నాయకుడు కుందుల సత్యనారాయణ వర్గం నుంచి ఒక్క కార్యకర్త కూడా బయటకు రాకుండా సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. దీంతో కుందుల దుర్గేష్ మాజీ ఎమ్మెల్యే శేషారావు మద్దతు కోరారు. దీంతో ఇక్కడ శేషారావు కూడా రెండో ఎమ్మెల్యేగా ఉంటారని చెప్పడంతో ఉమ్మడిలో షాడో ఎమ్మెల్యేలు తయారవుతారనే సంకేతం ఇచ్చినట్లు ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికే టీడీపీ చెబుతున్న ఆరు హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేకపోవడం, ఎక్కడ కూడా ప్రజల నుంచి స్పందన రాకపోవడంతో నాయకులు ఇద్దరు ఎమ్మెల్యేలు ఉంటారనే ఈలాంటి వ్యాఖ్యలతో కార్యకర్తలను ఆకుట్టుకుంటున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

### ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



గోపాలపురం ఎంపీయూపీ పాఠశాలలో మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం సుబ్బారావు

**గోపాలపురం:** మొక్కల పెంపకం వల్ల కాలుష్య నివారణతో పాటు మనిషికి పూర్తిస్థాయిలో ఆక్సిజన్ లభిస్తుందని ప్రతి వ్యక్తి తప్పనిసరిగా మొక్కలు నాటాలని ఎంపీయూపీ పాఠశాల హెచ్‌ఎం డి.సుబ్బారావు అన్నారు. స్థానిక బీసీ కాలనీ ఎంపీయూపీ పాఠశాలలో గురువారం అంతర్జాతీయ అటవీ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హెచ్ ఎం.సుబ్బారావు చిన్ననప్పటి నుంచే మొక్కల పెంపకాన్ని విద్యార్థులు అలవాటుగా చేసుకోవాలన్నారు. సీఆర్పీ కొయ్య నాగరాజు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### మాదిగల ఆత్మీయ సదస్సు వాయిదా

**కొవ్వూరు:** చాగల్లు మండలం ఎస్.ముప్పవరం గ్రామంలో 23వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించ తలపెట్టిన మాదిగల ఆత్మీయ సదస్సు అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు వైఎస్సార్ సీపీ దళిత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముప్పిడి విజయరావు తెలిపారు. ఈ సమావేశం నిర్వహణ తేదీని మళ్లీ ప్రకటిస్తామన్నారు.

### పేకాట ఆడుతున్న 18 మంది అరెస్టు

- రూ.67,200 నగదు స్వాధీనం
- పట్టుబడిన వారిలో పలువురు ప్రముఖులు!

**కొవ్వూరు:** దొమ్మేరులో టీడీపీ నాయకుడికి చెందిన ఓ కల్యాణ మండపంలో పేకాట శిబిరంపై గురువారం పట్టణ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 18 మందిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. వీరి నుంచి రూ.67,200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన వారిలో ప్రముఖ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, వైద్యులు, వ్యాపార వేత్తలున్నారని సమాచారం. రాజమహేంద్రవరం, కాతేరు, త్యాజంపూడి, దేవరపల్లి, కొవ్వూరు పట్టణంతోపాటు పరిసర ప్రాంత మండలాలకు చెందిన వారు ఉన్నారు. గత కొంత కాలం నుంచి గుట్టుచప్పుడుగా ప్రొఫెషనల్ క్లబ్‌లో పేకాట నడుపుతున్నట్టు సమాచారం. ప్రముఖులు పట్టుబడడంతో పెద్ద ఎత్తున సొమ్ములు చేతులు మారినట్లు చెబుతున్నారు. ఈ పేకాట వ్యవహారాన్ని పట్టణ పోలీసులు గోప్యంగా ఉంచడం విమర్శలకు తావిస్తోంది.

# దోమల వ్యాప్తి నివారణకు చర్యలు



కానూరులో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైద్య సిబ్బంది

**పెరవలి:** దోమల వ్యాప్తిని నివారించాలని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకూడదని, మురుగునీటిని తొలగించాలని తణుకు సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు తెలిపారు. డే డ్రైడే సందర్భంగా మండలంలోని కానూరు పీహెచ్‌సీ పరిధిలోని కానూరు, మునిపల్లి గ్రామాల్లో ఇంటింటా తిరిగి దోమల వ్యాప్తిపై అవగాహన కల్పించారు. ఇండ్ల వద్ద మురుగునీరుతో పాటు రుబ్బురోళ్ళు, కొబ్బరి బొండాలాల్లో ఈ దోమలు ఎక్కువగా జీవిస్తాయని తెలిపారు. దోమల లార్వా నీటిపై ఏర్పడిన తరువాత 8 రోజులకు దోమగా వృద్ధి చెందుతుందని, అవిలేకుండా పరిసరాలు పరిశుభ్రతతో పాటు మురుగునీరు నిల్వ లేకుండా చేసుకోవాలని వివరించారు. ఇంటిలో ఉండే నీళ్ళ బిందెలపై తప్పని సరిగా మూతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వి.నాగేశ్వరరావు, కార్యదర్శులు ఎస్.రేవతి, ఎస్.వెంకాయమ్మ శ్రీనివాస్ ఆశావర్కర్లు పాల్గొన్నారు.

WANTED
Fresh Fitters
Boilar Operators
Electrician
Mechanical
Computer Accountant
VEDANTHA AQUA FOOD PRODUCTS
Avapadu Village, Nallajarla Mandal
E.G.District, Cell :94408 22779

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిడదవోలు డివిజన్
90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com